క్లుప్తంగా

నిబంధనలకు వ్యతిరేకంగా కళాశాలల నిర్వహణ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ప్రైవేటు ఐటీఐలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్నాయన్నారు. విద్యార్థుల దగ్గర రికార్డుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కనీస మౌలిక వసతులు లేని ఐటీఐలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు రాజు, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలకు 'ఏ' గ్రేడ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ లభించింది. గతనెల 29, 30 తేదీలలో కళాశాలను సందర్శించిన న్యాక్ ఆర్గనైజేషన్ బృందం పరిశీలన అనంతరం 'ఏ'గ్రేడ్ ఇచ్చింది. కళాశాలకు న్యాక్ టీమ్ ఏ గ్రేడ్ ఇవ్వడం సంతోషదాయకమని ప్రిన్సిపాల్ కె.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. అలాగే కళాశాలకు ఏ గ్రేడ్ రావడంపై కరస్పాండెంట్ రామకృష్ణారెడ్డి, డైరెక్టర్ బి.శివవిష్ణుమోహన్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం హర్షం వ్యక్తం చేసింది.

సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు వినతి

కడప రూరల్: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తల లింగమూర్తి, గోవిందు నాగరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళామణులకు ఆదర్శ మూర్తి సావిత్రిబాయి పూలే కాంస్య విగ్రహాన్ని కడప నగరంలో ఆర్టీసీ బస్టాండ్, అప్సర హాల్ రోడ్, బైపాస్ సర్కిల్‌లో ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. సంకేసుల బాదుల్లా పాల్గొన్నారు.

నేడు అంజుమన్ తరక్కీ ఉర్దూ సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడపలోని రహమతుల్లా వీధిలోని అంజుమన్ తరక్కీ ఉర్దూ జిల్లాశాఖ కార్యాలయంలో 27 మంగళవారం సాయంత్రం 7 గంటలకు కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సత్తార్‌ఫైజీ, సయ్యద్ హిదయతుల్లా ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లలో ఉర్దూ రెండో అధికార భాష అమలుపై చర్చిస్తామని, అంజుమన్ కార్యవర్గ సభ్యులు పాల్గొనాలని వారు కోరారు.

దృశ్య కావ్యం దేవదాసు

ప్రొద్దుటూరు కల్చరల్ : అక్కినేని నాగేశ్వరరావు దేవదాసు చిత్రంలో నటించలేదని, జీవించారని అక్కినేని నాగార్జున ఫ్యాన్స్ జిల్లా ప్రెసిడెంట్ నల్లం రవిశంకర్ తెలిపారు. దేవదాసు చిత్రం విడుదలై 70 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ప్రొద్దుటూరులో సోమవారం వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని అభిమానులందరూ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం రవిశంకర్ మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి జంటగా నటించిన దేవదాసు తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అక్కినేని అభిమానులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ నాగేశ్వరరావు, డీఎం బాషా, సింగ్, సుబ్బరాయుడు, గణేష్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నల్లం రవిశంకర్‌ను అభిమానులు సన్మానించారు.

ఆర్‌ఎస్‌వైఎఫ్ ఆందోళన

కడప ఎడ్యుకేషన్: అధిక ఫీజులను వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఒరగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫీజుల దోపిడీకి నిరసనగా ఆర్‌ఐవో కార్యాలయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఈఈ, నీట్ పేరుతో విద్యార్థుల నుంచి లక్షలాది రుపాయలను దోచుకుంటున్నారన్నారు. అక్రమంగా అడ్మిషన్లను నిర్వహించి అధిక ఫీజులను వసూలు చేస్తున్నా పట్టించుకునే వారు కరువయారన్నారు. అనంతరం ఆర్ఐఓ రమణరాజుకు వినతిపత్రమిచ్చారు. ఆర్‌ఎస్‌వైఎఫ్ నాయకులు కిరణ్, ఆదిత్య, అరుణ్, సునిల్, మురళీ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కడప ఎడ్యుకేషన్: యాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎన్‌ఫోర్సుమెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం కడప ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

కడప అర్బన్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పాఠశాల, కళాశాల విద్యార్థులకు డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కడప రిమ్స్ పీఎస్ పరిధిలో ఎస్ఐ నారాయణ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు.

ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత

మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ సూచించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 53 అర్జీలు వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని ఆయన ఆయా శాఖల అధిపతులను ఆదేశించారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కడప నగరంలోని 9వ డివిజన్ ఎన్‌జీవో కాలనీలో కమిషనర్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా ఉండటం గమనించి వాటిని తక్షణం తొలగించాలన్నారు. పలు కల్వర్టులకు మరమ్మతులు చేయాలని సూచించారు.



మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఎన్‌జీవో కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

జియో వారు వైరింగ్ కోసం తవ్విన గుంతలు వెంటనే పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాత ఆర్టీఓ ఆఫీసు రోడ్డులో ఆక్రమణలు తొలగించి కాలువ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 9వ డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

మాసాపేటలో నివసించే పారిశుధ్య కార్మికులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని 26వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సి.త్యాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్యాగరాజు మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ మాసాపేట కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని తమ నాయకుడు, మాజీ కార్పొరేటర్ బక్కా అయ్యన్నకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నందున ఆ సమస్యను పరిష్కరించాలని ఇదివరకు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులకు కూడా విన్నవించామన్నారు. మాసాపేట ఆలయ ధర్మకర్త గున్నా గంగాధర్, కె. బాబు, సాయి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

– ఎస్ఈబీ సీఐ విశ్వనాథరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరంలోని సుమన్ కోచింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా, వ్యతిరేక దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ నేటి యువతలో చాలా మంది మత్తు పదార్థాలకు బానిసలుగా మారి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తొలుత మత్తు పదార్థాలు తీసుకోవడం సులభంగా ఉంటుందని, అయితే రానురాను వాటికి బానిసలుగా మారిపోయి తమ జీవితాన్నే సర్వనాశనం చేసుకుంటారన్నారు.



మాట్లాడుతున్న సీఐ విశ్వనాథరెడ్డి

ఈ విషయంగా యువత అప్రమత్తంగా ఉంటూ వాటి జోలికి వెళ్లకూడదని సూచించారు. కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సుమన్, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 110 మంది శిక్షణ పొందుతున్న విద్యార్థులతోపాటు కోచింగ్ సెంటర్ సిబ్బంది, స్టెప్ సిబ్బంది జీవీ సుబ్బారావు, జి.నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' బృహత్తర కార్యక్రమం

కడప కార్పొరేషన్: జగనన్న సురక్ష కార్యక్రమం బృహత్తరమైనదని 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఏపీహెచ్‌బీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఎవరెవరికి ఏ ధ్రువపత్రాలు అవసరమో తెలుసుకొని దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 10 రకాల సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 100 శాతం వికలాంగత్వం ఉన్న వై. నీరజకు రూ.10వేలు పెన్షన్ వచ్చేందుకు డీఎండ్‌హెచ్ఓ వారి ద్వారా దరఖాస్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ అడ్మిన్ శివాజీ, సెక్రటరీలు వీరాంజనేయులు, డేవిడ్ పాల్గొన్నారు.



మానసిక వికలాంగురాలైన నీరజకు పింఛన్‌కు దరఖాస్తు చేస్తున్న కార్పొరేటర్, సచివాలయ సిబ్బంది

పద్మావతి మాతకు స్నపన తిరుమంజనం

కడప కల్చరల్ : కడప నగరం దేవునికడపలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీ పద్మావతి మాతకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుమల–తిరుపతి దేవస్థానాల పరిధిలో ఉన్న ఈ ఆలయంలో అమ్మవారికి ప్రాతఃకాల పూజలనంతరం స్వామి సన్నిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు మయూరం కృష్ణమోహన్ అమ్మవారి ఉత్సవమూర్తికి క్షీరం, నారికేళ జలం, పసుపు, చందనం తదితర ద్రవ్యాలతో విశేష అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి కలువ పూలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేకమైన పల్లకీపై కొలువుదీర్చి ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవాన్ని మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా నిర్వహించారు.



విశేష అలంకారంలో శ్రీ పద్మావతి మాత

ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాల్గొన్న భక్తుందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అధిక ఫీజులు నియంత్రించాలి

ధర్నాలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యమాదిగ

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రించడంతో పాటు... ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ జీఓ తుంగలో తొక్కి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలు సడలించి అన్ని సామాజిక వర్గాలకు అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వర్తింపజేయాలని కోరారు. అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలన్నారు. క్యాన్సర్, గుండె జబ్బులు, బీపీ, షుగర్ లాంటి ప్రాణాంతక వ్యాధులతో బాధ పడుతున్న వారికి నెలకు రూ. 10 వేలు ఆరోగ్య భద్రత పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. సేంద్రీయ ఎరువులతో పంటలు పండించేలా రైతులకు సూచించాలని, అలా చేయని వారికి ప్రభుత్వ సాయం నిరాకరించాలన్నారు. యాచకులకు ఆధార్, రేషన్‌కార్డులు, ఓటుహక్కు కల్పించాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బీసీ గంగులు, ఆంజనేయులు, విజయ్‌కుమార్, ఓబులేశు, చిన్న ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాస్టర్ల సమస్యలను పరిష్కరించండి

కడప కల్చరల్ : జిల్లాలోని పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విన్నవించారు. సోమవారం కడప నగరం ప్రకాశ్‌నగర్‌లోని బేతనీయ ప్రార్థనా మందిరంలో ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు గల సంఘాల కార్యవర్గాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుత క్రైస్తవ పాస్టర్లు పలు సమస్యలతో సతమతమవుతున్నారని, వాటి పరిష్కారం కోసం ఎదురుచూస్తూ పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాలా మంది పాస్టర్లకు గౌరవ వేతనం అందడం లేదని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5200 మంది పాస్టర్లు ఉండగా,రెండవ విడత 3200 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాస్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పాస్టర్ డేవిడ్ వాక్య సందేశం అందజేశారు. పాస్టర్ ప్రభుదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి బిషప్ శ్యాముల్‌బాబు, వివిధ విభాగాల ప్రతినిధులు రమేష్‌రెడ్డి, విజయశేఖర్, సంగటి జోసెఫ్, జ్ఞానానందం, శుభాకర్, సందీప్‌రాజు, అరుణ్, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ సంఘాల సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ గురువులు

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం అర్ధరాత్రి ముగిశాయి. సబ్‌జూనియర్ అండర్ –11, 13 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాలోని పలుప్రాంతాలకు చెందిన 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కరరెడ్డి మాట్లాడుతూ నిత్యం క్రీడాసాధన చేసి నైపుణ్యం సంపాదించి ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. క్రీడాకారులకు చాలామందికి ఐడీ లేదని, త్వరగా ఐడీ తీసుకోవాలని కోరారు. లేకుంటే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కోల్పోతారన్నారు. జార్జ్‌కారొనేషన్ క్లబ్ సెక్రటరీ గంగిరెడ్డి మాట్లాడారు. విజేతలుగా నిలిచిన వారికి మెమెంటోలను అందచేశారు. అండర్–13 బాలుర విభాగంలో మోహ్మద్ ఆదిల్, బాలికల విభాగంలో పూర్వజ, అండర్–11 బాలుర విభాగంలో విశాల్‌రెడ్డి, బాలికల విభాగంలో కుజుమాకానం ఛాంపియన్లుగా నిలిచారు. పోటీలను బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, చైర్మన్ జిలాని బాష, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు, కోచ్ సుదర్శన్, అనిల్, సోని, సామ్యూల్, రామయ్య, జాకీర్ తదితరులు పర్యవేక్షించారు.



విజేతలతో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

కడప ఎడ్యుకేషన్: జాతీయ నూతన విద్యా విధానాన్ని అమలు చేసే సాకుతో జీవో 117ను అమలు చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను కుదించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదన్ విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం కడప పట్టణంలోని యూటీఎఫ్ భవన్‌లో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన బడిలో విద్యార్థులను చేర్పిద్దాం– ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం అనే కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే కుట్రలో బాగంగా జీవో 117 ను అమలు చేస్తూ 3,4,5 తరగతులను కిలోమీటర్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిందని మండిపడ్డారు. జాతీయ నూతన విద్యా విధానం అమలు పేరుతో విద్యారంగంలో చేపట్టిన సంస్కరణల వల్ల రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం పునాది బీటలు వారుతోందన్నారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, జిల్లా కార్యదర్శి చెన్నయ్య, నాయకులు కిరణ్‌కుమార్, పవన్‌కుమార్, కంచిరెడ్డి, గోపీనాథ్, బాస్కర్‌రెడ్డి, కృష్ణయ్య, ఈశ్వరరావు, రాయచంద్రయ్య, చెన్న కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

వల్లూరు: ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. వల్లూరు మండల పరిధిలోని నల్లపురెడ్డి పల్లె గ్రామం నుండి వల్లూరుకు వెళ్లే అప్రోచ్ రోడ్డులో జింకల వంకపై నిర్మించనున్న కల్వర్టు నిర్మాణానికి సోమవారం జరిగిన భూమి పూజ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రూ. 38 లక్షల సీఎం డెవలెప్‌మెంట్ నిధులతో నిర్మించనున్న ఈ కల్వర్టు నిర్మాణానికి వేద పండితుల పూజల అనంతరం వారు కొబ్బరి కాయలను కొట్టి భూమి పూజ నిర్వహించారు. అనంతరం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక పక్క సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మరో పక్క అభివృద్ధికి సైతం అంతే ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చే వినతుల మేరకు ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ కల్వర్టు నిర్మాణం కోసం స్థానిక ప్రజల నుండి వచ్చిన వినతుల మేరకు పరిశీలన చేసి కల్వర్టు ప్రాధాన్యతను గుర్తించి మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులు రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.




కల్వర్టు నిర్మాణ పనుల భూమి పూజలో పాల్గొన్న ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెండ్లిమర్రి: మండలంలోని రంపతాడు గ్రామ సచివాలయం పరిధిలోని రంపతాడు, మమ్ముసిద్దుపల్లె, జంగంరెడ్డిపల్లె గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

కడప అర్బన్: జిల్లావ్యాప్తంగా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు సోమవారం అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రౌడీషీటర్లను, చెడు ప్రవర్తన కలిగిన వారికి ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఆవరణలో పోలీసు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, అనవసరంగా గొడవలలో తలదూర్చరాదని సూచించారు. కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో సీఐ సయ్యద్ హసం, ఎస్ఐ జయరాముడు, చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ రవికుమార్ తమ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ రవికుమార్

పులివెందుల ఆర్టీసీ డీఎంగా రామకృష్ణారెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్టీసీ డీఎంగా రామకృష్ణారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఆర్టీసీ డీఎం ఉమామహేశ్వర్‌రెడ్డి విశాఖపట్టణంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మైదుకూరు ఆర్టీసీ డీఎంగా పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి పులివెందుల ఆర్టీసీ డీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల ఆర్టీసీ డిపోను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

29న గంగమ్మతల్లి వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన శ్రీ ఏరువాక గంగమ్మతల్లి 26వ వార్షికోత్సవం ఈ నెల 29వ తేదీన నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ నెల 29వ తేదీన ఉదయం నుంచి శ్రీ మహాగణపతి పూజ, కలశస్థాపన , అమ్మవారికి పంచామృతాభిషేకం , కుంకుమార్చన పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు.

నేతన్న నేస్తంలో లంచాలు అరికట్టాలి

కడప సెవెన్‌రోడ్స్ : నేతన్న నేస్తం మంజూరుకు ప్రతిపాదనకు పంపే విషయంలో సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు లంచాలు గుంజుతున్నారని జాతీయ చేనేత ఐక్యవేదిక అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున సోమవారం కలెక్టర్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దీనిని అమలు చేస్తోందని, జిల్లాలో 9 వేల మందికి ప్రభుత్వ సాయం అందుతోందన్నారు. అయితే అధికారులు లంచాలు తీసుకుని అనర్హులకు కూడా ప్రతిపాదనలు పంపుతున్నారన్నారు. ముద్దనూరు మండలం కొలవలి గ్రామ సచివాలయ సిబ్బంది రూ. 5 వేలు అడుగుతున్నారని ఆరోపించారు. జిల్లా చేనేత జౌళిశాఖ అధికారుల నిర్లక్ష్యం, సచివాలయ ఉద్యోగులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల ఈ పథకం అందరికీ అందడం లేదన్నారు. చేనేత కార్మికుల పెన్షన్, నేతన్న నేస్తం పథకం సక్రమంగా అమలు చేయాలన్నారు. మైదుకూరు మండలం కూర్లగూడ సచివాలయ సిబ్బంది నేతన్నలను వేధిస్తున్నారని తెలిపారు. వీటిపై విచారణ జరిపి సంబంధిత ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి నేత కార్మికునికి నేతన్న నేస్తం వచ్చేలా చూడాలన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ విజేతకు అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : గతేడాది స్వచ్ఛ సర్వేక్షణ్–2022లో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్ పర్యవేక్షణలో కడప నగరంలోని ఇండోర్ స్టేడియంలో పెయింటింగ్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్శిటీ విద్యార్థులు తమపేర్లు నమోదు చేసుకున్నారు. శిల్ప విభాగంలో రెండవ సంవత్సరం చదువుతున్న గౌతమి తేజ ప్లాస్టిక్‌ను ఎలా నిషేధించాలో పెయింటింగ్ రూపంలో ప్రదర్శించి విజేతగా నిలిచారు. వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి ఆ విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ నిషేధించాలని సూచించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, కల్చరల్ ఈవెంట్ కో ఆర్డినేటర్ శివం పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు బహుళ ఔషధ చికిత్స



కుష్టు వ్యాధి సర్వేను ప్రారంభిస్తున్న ఖాదర్‌వల్లీ

కడప రూరల్: కుష్టు వ్యాధి నిర్ధారణ అనంతరం ఉచితంగా బహుళ ఔషధ చికిత్సను అందిస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌కే నగర్‌లో కుష్టు వ్యాధి సర్వే కార్యక్రమంను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కుష్టు వ్యాధిపై సర్వే కార్యక్రమం జూలై 16వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అనుమానిత వ్యాధిగ్రస్తులను గుర్తించి దగ్గరలోని పట్టణ ప్రాథమిక చికిత్సా కేంద్రంలో వ్యాధి నిర్ధారణ జరుగుతుందన్నారు. ఎవరికైనా వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా బహుళ ఔషధ చికిత్సను అందిస్తామని పేర్కొన్నారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వీవీ మనోహర్, డాక్టర్ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం దారుణమన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరిపోయే సీఎం రమేష్, ఆదినారాయణరెడ్డిలకు ముఖ్యమంత్రిని విమర్శించే నైతిక అర్హత లేదన్నారు. ఇక సత్యకుమార్ ఒట్టి అబద్ధాలు మాట్లాడుతూ అసత్య కుమార్‌గా మారారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇంగ్లీషు రాదని చెప్పడం వారిని అవమానించడమేనన్నారు. ప్రభుత్వంపై విమర్శించేందుకు ఏమీ లేకే వైఎస్ వివేకా హత్య కేసును తెరపైకి తెస్తున్నారని మండిపడ్డారు. సీఎం రమేష్, ఆదినారాయణ రెడ్డి తమ స్వార్థం కోసం పార్టీలు మారి, తమను తాము అభివృద్ధి పరుచుకున్నారే తప్పా ప్రజలకు మేలు చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారానే జిల్లా అభివృద్ధి సాధ్యమన్నారు. కడప స్టీల్ ప్లాంట్ కోసం ఎన్ని ఉద్యమాలు చేసినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఉనికి కోసమే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, ఎన్ని చేసినా వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపు ద్వారా అన్ని నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు కారణమైన బీజేపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.